క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

కాకినాడ రూరల్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పండూరు పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ వాసంశెట్టి సత్య సంతోషి కోరారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఆహారం, తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల కారణంగా మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కండ్ల కలకలు ఎక్కువగా వస్తున్నాయని, ఒకరి నుంచి మరొకరికి వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, వరలక్ష్మి, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌జీలో అరబిందో ఫార్మా జాబ్‌మేళా

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అరబిందో ఫార్మా కంపెనీ జాబ్‌మేళా నిర్వహించారు. డిగ్రీ ఆఖరి సంవత్సర సైన్స్ విద్యార్థులు 88 మంది హాజరు కాగా 58 మందిని ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలకు ఎంపికచేశారు. ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించి విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఏలియా, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ సోమరాజు అభినందించారు.

చెట్టు కూలి ట్రాఫిక్ బంద్


నడకుదురులో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న సీఐ శ్రీనివాస్

కరప: కాకినాడ–రామచంద్రపురం ప్రధాన రహదారిలో నడకుదురు గ్రామంలో మంగళవారం సాయంత్రం చెట్టుకూలి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్టు మొదలు మట్టి కొట్టుకుపోవడంతో నడకుదురులో రోడ్డుపై చెట్టుకూలిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న సీఐ వి.శ్రీనివాస్ గమనించి, కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణకు సమాచారం అందించారు. రోడ్డుపై పడిన చెట్టుకొమ్మలు రంపంతో కోయించి కరప పోలీసుస్టేషన్ సిబ్బందితో పాటు సీఐ శ్రీనివాస్ అడ్డుగా ఉన్న చెట్టును స్వయంగా తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రయాణికులు, వాహనచోదకులు పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాకారులూ.. పేర్లు నమోదు చేసుకోండి

కరప: గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరిట ఆటల పోటీలను అక్టోబరు 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నదని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. కరపలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇందులో భాగంగా 17 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు తమపరిధిలోని గ్రామ సచివాలయాల్లో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడలలో పోటీలు జరుగుతాయన్నారు. గ్రామ సచివాలయ స్థాయిలో ప్రతిభ కనపరచిన వారికి, మండలస్థాయిలో, తర్వాత జిల్లా స్థాయిలో పోటీలలో పాల్గొంటారని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు.

ఓటర్ల సర్వేకు సహకరించాలి

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల రీ సర్వేకు అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలపై ప్రజల్లో అపోహలు తొలగించేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎన్నికల డీటీ కాంతారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, (వైఎస్సార్ సీపీ), నీలపాల సూరిబాబు (సీపీఎం), అడబాల కుమారస్వామి (టీడీపీ) లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్లు తగ్గితే ప్రాణానికే ప్రమాదం

కొత్తపల్లి: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య తెలిపారు. నాగులపల్లిలో మంగళవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్లు చిగుళ్ళ నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు.

ఓటరు సర్వేకు సహకరించండి

కమిషనర్ మహేష్ కుమార్


రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఓటర్ సర్వేపై ఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ మంగళవారం సమీక్షించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ సహా జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఓటరు సర్వేకు సహకరించాలని ఆయన నాయకులను కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సర్వే జరుగుతున్న తీరును కమిషనర్ వివరించారు. ఏమైనా ఇబ్బందులు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చునని ఆయన సూచించారు."ఈసమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ సీతాపతిరావు, అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆదివారం కూడా చెత్త సేకరణ చేయాలి

నగరంలో ఆదివారం కూడా చెత్త సేకరణ జరగాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన 1, 4 సర్కిళ్ల పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీఎల్, దుమ్ములపేట డ్రైనేజ్ అవుట్‌లెట్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణపై ఆరా తీశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరువేరుగానే ఇవ్వాలని స్పష్టం చేశారు. సేకరించిన చెత్తను హూపర్ టిప్పర్ వాహనాలలో తరలించాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ఆదివారం చెత్త సేకరణ జరగని విషయాన్ని గుర్తించారు. దీనిపై కింది స్థాయి సిబ్బందికి, చెత్తను సేకరించే ఏజెన్సీకి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ఈ విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.


డ్రైనేజీ అవుట్‌లెట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

వలంటీర్ సేవలు అమోఘం

పెదకొత్తూరు వలంటీర్ పెదిరెడ్డి దేవి తన పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఈ క్రమంలో మడక వరలక్ష్మికి పలు పథకాలు వచ్చేలా చేసి, జెరాక్స్ షాపు పెట్టించి స్వయం ఉపాధి కల్పించారు. పంటపొలం ఉంటే రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రాయించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ రప్పించారు. పింఛన్ వచ్చేలా చేసి ప్రతినెల మొదటి తేదీనే సూర్యోదయానికి ముందే పింఛన్ అందజేస్తున్నారు. లబ్ధిదారులకు చేయూతనిస్తూ ఆమె చేస్తున్న సేవలు అమోఘమని ఆయా కుటుంబాలవారు ప్రశంసిస్తున్నారు.


పెదకొత్తూరులో పింఛన్ ఇచ్చేందుకు లబ్ధిదారుని జెరాక్స్ షాపు వద్ద వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ దేవి

స్వయం ఉపాధి కల్పించారు



కొద్దిపాటి వ్యవసాయ ఆదాయంతో జీవిస్తున్న మాకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ చేదోడు ద్వారా రూ.76,250 రాగా జెరాక్స్ షాపు పెట్టించి స్వయం ఉపాధి కల్పించారు. వైఎస్సార్ సున్నావడ్డీ రూ17,766, వైఎస్సార్ భరోసాలో రూ.48 వేలు, పంటల బీమాగా రూ.22,627, ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.4,650, పంటరుణంపై సున్నావడ్డీ రూ.1,944 వచ్చేలా చేశారు. పింఛన్ రాయించి, ప్రతినెలా పింఛను ఇస్తున్నారు. వీటితో పాటు ఇంటిస్థలం పట్టా వచ్చేలా చేశారు. ఇటువంటి సేవలందిస్తున్న వలంటీర్ సేవలు ఎప్పటికీ గుర్తుంచుకుంటాం.

– మడక వరలక్ష్మి, పెదకొత్తూరు

సేవలు సంతృప్తికరం



కాశికాయలవారి వీధికి చెందిన పెద్దపాటి కనకలక్ష్మిచే వాలంటీర్ ఈశ్వర్ ఇంటి పట్టాకు దరఖాస్తు చేయించి కొమరగిరి లే అవుట్‌లో పట్టా ఇప్పించారు. అంతే కాకుండా చేయూత పథకానికి దరఖాస్తు చేయించి నగదు అందజేశారు. అలాగే ఆమె పిల్లలకు విద్యాదీవెన, వసతి దీవెన పథకం వర్తించేలా వలంటీర్ కృషి చేశారు. వీటితో పాటు ఆమె అత్తయ్య సుబ్బలక్ష్మిచే వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేయించి ఫించన్ ఇప్పించారు. ప్రతి నెల తెల్లవారక ముందే ఫించన్ అందజేస్తున్నారు. వలంటీర్ ఈశ్వర్ అందజేస్తున్న సేవలకు కుటుంబం ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తోంది.

కౌలు రైతులందరికీ కార్డులు, రుణాలు

జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

కరప: గ్రామాల్లోని అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, నిర్దేశించిన లక్ష్యాలు నూరు శాతం పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ ఇలాక్కియ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కౌలు రైతులు, వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో 3,543 మందికి సీసీఆర్‌సీ ధృవీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉండగా 70 శాతం మేర 2,456 మందికి ఇచ్చారని, మిగిలిన లక్ష్యాన్ని కూడా పూర్తిచేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చిన తర్వాత బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకు మేనేజర్లను కలసి కౌలురైతులకు ఇచ్చే పంట రుణాలపై చర్చించి, మంజూరు చేయించాలని ఆమె సూచించారు. పెద్దాపురప్పాడు, పెనుగుదురు, జెడ్.భావారం, కరప తదితర గ్రామాల కౌలురైతులకు ఆమె సీసీఆర్‌సీ పత్రాలు అందజేశారు. అనంతరం కరప డీసీసీబీ, వేళంగి ఎస్‌బీఐ శాఖలకు వెళ్లి ఆయా బీఎంలతో మాట్లాడి గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులు అందరికీ పంట రుణాలు మంజూరు చేయాలని జేసీ సూచించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డీటీ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచరావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు సీసీఆర్‌సీ పత్రాలు అందజేస్తున్న జేసీ ఇలక్కియ

వన్‌టౌన్ పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

కాకినాడ క్రైం: కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. స్టేషన్ నిర్వహణతో పాటు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వన్ టౌన్ అధికారులు, సిబ్బంది సేవలపై అభిప్రాయాన్ని కోరారు. ఫిర్యాదుదారులు వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట సీఐ కృష్ణ, ఎస్ఐ అనూష తదితరులు ఉన్నారు.

ఏపీఐఐసీ సిబ్బందికి వైద్య పరీక్షలు


శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జోనల్ మేనేజర్ హరిధరరావు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పారిశ్రామిక వాడల్లోని పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. జోనల్ మేనేజర్ బడగల హరిధరరావు ఆధ్వర్యంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సహకారంతో డాక్టర్ మోహన్ డయాబెటిక్ సెంటర్, పార్థ డెంటల్, దత్త ఐ కేర్ వైద్యులు, సిబ్బంది సుమారు 160 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. బీమా సంస్థ మేనేజర్ విద్యా సాగర్, వైద్యులు పాల్గొన్నారు.

విపత్తుల వేళ ఎన్‌సీసీ సేవలు


జేఎన్‌టీయూకే ఎన్‌సీసీ యూనిట్‌ను సందర్శించిన ఎన్‌సీసీ డీడీ మధుసూదనరెడ్డి

డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విపత్తుల సమయంలో ఎన్‌సీసీ సేవలు అందిస్తున్నామని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ (ఏపీ,తెలంగాణా) ఎయిర్ కమాండర్ వి.మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఉన్న ఎన్‌సీసీ యూనిట్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. తెలంగాణ నాలుగు, ఏపీలో ఐదు ఎన్‌సీసీ గ్రూపులు ఉన్నాయని, కాకినాడ గ్రూపులో అత్యధికంగా 13 యూనిట్లు ఉన్నాయన్నారు. ఎన్‌సీసీ సైబర్ సెక్యూరిటీ పాఠ్యాంశంగా చెబుతున్నామని, నిధుల సమస్య వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సీసీ విస్తరణకు అవకాశం తక్కువ ఉందన్నారు. ఆయన వెంట కాకినాడ యూనిట్ గ్రూప్ కమాండర్ ఏకే రిషి పాల్గొన్నారు.

జాంధానీ చీరలను పరిశీలించిన విద్యార్థులు


చేనేత సొసైటీలో జాంధానీ చీరల డిజైన్లను పరిశీలిస్తున్న ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు

కొత్తపల్లి: జాంధానీ చీరల తయారీలో పేటెంట్ హక్కు పొందిన ఉప్పాడ జాంధానీ చీరలను హైదరాబాదుకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఉప్పాడలో చేనేత సొసైటీ, కొత్తపల్లిలోని శ్రీ దుర్గా చేనేత సొసైటీలో తయారు చేసిన చీరలను ప్రొఫెసర్ డాక్టర్ పృథ్వీరాజ్ మాల్ ఆధ్వర్యంలో పరిశీలించారు. చీరలు తయారీ విధానాన్ని, డిజైన్ల వివరాలను సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చేనేత మగ్గాల వద్దకు వెళ్లి చీరల తయారీని పరిశీలించారు. పృథ్వీరాజ్ మాల్ మాట్లాడుతూ ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా చీరల తయారీ, డిజైన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళగిరి, వెంకటగిరి, పొందూరు, ఉప్పాడ తీసుకువెళ్లామన్నారు. ఒక్కో ఏరియాలో ఒక్కో విధంగా చీరల తయారీలో కళాకారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. ముఖ్యంగా ఉప్పాడ జాంధానీ చీరల తయారీలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. చీర రెండు వైపులా ఒకే విధంగా ఉండడమే విద్యార్థులకు ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు.

శానిటరీ ప్యాడ్ల వితరణ


మహిళకు శానిటరీ ప్యాడ్లు అందజేస్తున్న డాక్టర్ హేమలతాదేవి, డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం సాయంత్రం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో సేవలు పొందుతున్న మహిళలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు పంచారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ లావణ్యకుమారి సమక్షంలో వాటిని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్య భద్రతపై బాధ్యతతో పాటు జీజీహెచ్‌లో మహిళలకు గైనిక్ విభాగం అందిస్తున్న విశేష సేవలకు సంఘీ భావంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 200 మంది మహిళలకు శానిటరీ ప్యాడ్లు పంచినట్లు తెలిపారు.

మేధాశక్తితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్


దేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్‌పై మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేటి యువత, అధ్యాపకులు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) గురించి ఆలోచించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్, అప్‌స్కిల్స్ సంస్థ సహకారంతో డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్–లెవరేజింగ్ పైథాన్ టెక్నాలజీస్ ప్రాక్టికల్ అప్రోచ్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజానికి అవసరాలే ముఖ్యంగా ఉండే సాఫ్ట్‌వేర్ రూపొందించాలని, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ద్వారా మానవునికి భవిష్యత్‌లో సంభవించే ఆరోగ్యపరమైన సమస్యలను వైద్యులు గుర్తించనున్నట్టు తెలిపారు. ప్రస్తుత యువత సీఎస్‌ఈ వైపే మొగ్గు చూపుతున్నారని, వర్క్‌షాప్‌నకు అప్‌స్కిల్ సహకారం అందించడం సంతోషమన్నారు. ఐఐటీ భువనేశ్వరి అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ వారణాసి మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ మురళీ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఎం కృష్ణప్రసాద్, ఎస్.శాస్త్రి, సీఎస్‌ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సునీత, కె.ఝాన్సీ పాల్గొన్నారు.

దొరస్వామి పరిశోధన పత్రానికి ఉత్తమ పురస్కారం


గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ దొరస్వామినాయక్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): థాయ్‌లాండ్ దేశం ఖోన్‌కేన్ యూనివర్సిటీలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన ఏడవ అంతర్జాతీయ లైబ్రేరీ ఇన్ఫర్మేషన్–2023 సదస్సులో బెస్ట్ పేపర్ అవార్డు జేఎన్‌టీయూకే గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి బి.దొరస్వామి నాయక్ సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా 48 దేశాలు పాల్గొనగా ఆసియా ఖండంలో జేఎన్‌టీయూకే గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి దొరస్వామి నాయక్‌కు ఉత్తమ పురస్కారం దక్కింది. వర్సిటీ లైబ్రేరీలలో లైబ్రేరీ వనరులు, సేవలు, వినియోగదారుని సంతృప్తి అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. 2019 జనవరిలో కంబోడియా, 2021న శ్రీలంక రాజధాని కొలంబోలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొనగా ఇప్పుడు మూడోసారి పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా దొరస్వామి నాయక్‌ను వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ సుమలత, రెక్టార్ రమణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అసిస్టెంట్ లైబ్రేరియన్ వేంకటేశ్వరరావు అభినందించారు.

28న కిడ్నీ సమస్యలపై వైద్య శిబిరం

కాకినాడ: కిడ్నీ సంబంధ వ్యాధులపై ఈ నెల 28వ తేదీన ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి చెప్పారు. ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా సభ్యుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ పి.రవీంద్ర, ప్రముఖ కిడ్నీ మార్పిడి సర్జన్, యూరాలజిస్ట్ సీమకుర్తి సూర్యనిహార్ సంఘ సభ్యులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. కిడ్నీలో రాళ్లు, ప్రోస్టేట్, మూత్ర సమస్య, చెక్కెర వ్యాధి, బీపీ, క్రియాటిన్ సమస్యలతో ఉన్న వారికి అవసరమైన సూచనలిచ్చి, వైద్య సేవలు అందిస్తారన్నారు. సంఘ సభ్యులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య సేవలను పొందాలని కోరారు.

మణిపూర్ హింసపై నిరసన

- జిల్లా వ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు
- ర్యాలీలు, మానవహారాలు నిర్వహించిన ప్రజా సంఘాలు

కాకినాడ సిటీ: మణిపూర్ ఘటనలను ఖండిస్తూ మంగళవారం కాకినాడ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ సంయుక్తంగా కాకినాడలో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయా సంఘాల నాయకులు బిషప్ జి జోసెఫ్ బెన్నీ, రెవరెండ్ దొమ్మేటి శామ్యూల్ సాగర్, రిక్కి గూటం, శీరం ఐజాక్, విజయకుమార్ తదితరులు కృతికా శుక్లాను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దాలని కోరారు. బిషప్ ఈలి సువార్తరాజు, రెవరెండ్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

మణిపూర్ ఘటనలపై పైశాచిక ఆనందం పొందుతున్న బీజేపీ చర్యలను నిరసిస్తూ నైతికంగా కేంద్ర హోం మంత్రి, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కోరుతూ సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ ఘటనలపై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని అన్నారు. జెడ్పీ సెంటర్ నుంచి పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. సీపీఐ నాయకులు తాటిపాక మధు, కె.బోడకొండ, తోకల ప్రసాద్, కె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


కరపలో మానవహారంగా నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు


సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారం


కాకినాడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల విశ్వాసులు, ప్రతినిధులు

సీఐటీయూ ఆధ్వర్యంలో..

సీఐటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మణిపూర్ ఘటనలకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కరప: స్థానిక మార్కెట్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మణిపూర్ హింసాత్మక, అత్యాచార ఘటనలను ఖండిస్తూ మహిళలు నిరసన వ్యక్తంచేశారు. ఐద్వా, గ్రామిక సంఘాల మహిళలు మంగళవారం మార్కెట్‌సెంటర్‌కు చేరుకుని మానవహారంగా నిలబడి నిరసన తెలిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర హోమ్‌మంత్రి రాజీనామా చేయాలన్నారు. ఆయా సంఘాల నాయకులు సి.వీరవేణి, ఆర్.వెంకటలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, ఎం.భవాని, కె.కల్పలత తదితరులు పాల్గొన్నారు.

కొరిపల్లిలో జగనన్న సురక్ష


కొరిపల్లిలో లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

కరప: మండలం కొరిపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాన్ని సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు ప్రారంభించారు. సచివాలయం పరిధిలోని కొరిపల్లి, జెడ్.భావారం గ్రామాలకు చెందిన 385 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు దేవిశెట్టి సూర్యప్రకాష్, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.